# తాకట్టు బతుకు

ఉదయాన్నే చేతికర్రతో నేలని దృఢంగా తడుతూ మూడుమైళ్ల దూరం నడుస్తాడు జగన్నాథం. అక్కడ కొండగుర్తుగా పెట్టుకున్న ఒకరావిచెట్టుకింద బండమీద పదినిముషాలు విశ్రాంతి తీసుకుంటాడు. తరువాత ఇంటిదారి పడతాడు.

ఆరోజూ అలా వేకువనే పోయి బండమీద కూర్చున్నాడు. రెపరెపలాడుతున్న శబ్దం చెవిని పడింది. కళ్లద్దాలు చొక్కా అంచుతో తుడుచుకుని మరీ అటు చూశాడు. దగ్గిరగానే పాడుపడిపోయిన రాతి గోడ ఉంది. దాని పగులులోంచి కిచకిచమని ఏదో పిట్ట పిల్లలు పోటీపడి రొదచేస్తున్నాయి. ఒక పిట్ట రెక్కల్ని రెపరెప కొట్టుకుంటూ, ఆ పగులు దగ్గిరగా ఎగిరి తన ముక్కున కరచి తెచ్చిన పురుగుల్ని ఆ పిల్లల నోళ్లలో పెడుతోంది.

నాకో నాకో అని మారాము చేస్తున్నట్లున్న ఆ పిల్లలు వింతగా ఎర్రటి మాంసం ముద్దల్లా వున్నాయి. ఇంకా వెంట్రుకలు రాలేదు. అంగడిలో నిలువుగానూ అడ్డంగానూ రెండు కోతలు పెట్టి అమ్మకానికుంచిన దానిమ్మ పళ్లలాగ వాటి ఎర్రటి నోళ్లు తెరిచి తల్లి అందించే పురుగుల్ని ఆత్రంగా అందుకుంటున్నాయి పిల్లలు. ఆ తల్లి పిట్ట ఊరపిచ్చుక కన్నా కాసింత పెద్దదిగానూ, మైనగోరుకంటే కాస్త చిన్నదిగానూఉంది. శరీరమంతా తేనెరంగు. తలమీద మచ్చ మాత్రం నల్లగా ఉండి నున్నగా పిలకను వెనుక్కు దువ్వినట్లుగా వింతగా కనిపిస్తోంది. ఆరుపదులు దాటినా ఇలాటి పిట్ట ఒకటి పక్షిజాతిలోఉన్నట్లు గమనించనందుకు ఆశ్చర్యపోయాడు. ఆహారాన్ని ఒక పిల్ల నోటిలో గుచ్చి ఎగిరిపోయిన పిట్ట ఇంకో క్షణంలో ఇంకో దిశగా వచ్చి ఇంకో పిల్లనోటిలో పురుగును గుచ్చింది. ఇంత వేగంగా ఎలా రాగలిగిందా అని ఆశ్చర్యపోతున్న జగన్నాథానికి సందేహ నివృత్తి అయ్యేలాగ రెండు పిట్టలు ఆ కంతలోని పసికూనలకు పురుగులందిస్తూ కనిపించాయి. పక్కపక్కనే ఒకే కొమ్మమీద వాలాయి. తల్లి పక్షి మాత్రమే గుడ్లుపెట్టి పొదిగి, పిల్లలకు మేత పెడుతుందనే అభిప్రాయానికి అలవాడుపడ్డ జగన్నాథానికి ఈ విషయం మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. అక్కడెవరైనా ఉంటే ఆ పిట్ట జాతిని ఏమంటారో అడిగి పేరు తెలుసుకుందామనుకున్నాడు కానీ దగ్గరలో

జనసంచారం లేదు. చేతికర్రని అందుకుని నెమ్మదిగా ఇంటికి వచ్చాడు. రెక్కలు పిల్లలకు వచ్చేదాకా పెంచి సంరక్షించే ఉమ్మడి బాధ్యతను కొన్ని పిట్టలు గుర్తించడం తన పరిశీలనలోకి అంతవరకూ రానేలేదు.

వస్తూనే కాళ్లూ చేతులూ కడుక్కుని వరలక్ష్మమ్మ ఇచ్చిన పెద్దగ్లాసు అందుకున్నాడు. ఆరోజు వార్తాపత్రికను తిరగవేసి వెచ్చని పాలు తాగుతున్నాడు. పాలన్నీ తాగినట్లు నటిస్తూ కాసిన్నిపాలు మిగిల్చి చిన్న పిల్లవాడిలా దిక్కులు చూడ్డం అతనికెంత అలవాటో అంతకన్నా గడుసుతనంతో భర్తని ఒక కంట కనిపెడుతూ అతనిచేత పాలన్నీ పూర్తిగా తాగించడం ఆమెకు పరిపాటి.

"పెద్దవాడేమో విదేశాల్లో ఉన్నాడు. చిన్నాడేమో దేశం పొలిమేరల్లో ఉన్నాడాయె. మన ఆరోగ్యాలు జాగ్రత్తగా చూసుకోకపోతే ఎవరికి ఉద్ధరింపు. చీటికీ మాటికీ వాళ్లని పిలిపించి ఇబ్బంది పెట్టాలి. మనమూ కష్టపడిపోవాలి" అని గట్టిగా హెచ్చరించి మరీ పాలు తాగిస్తుంది.

ఆ ఉదయం, పాలగ్లాసు అందుకుని వార్తాపత్రిక చదువుతూ గ్లాసు అడుగున కాసిన్ని పాలు ఎప్పటిలా మిగిల్చి దిక్కులు చూశాడు. అదే సమయానికి భార్య బెండకాయలు తెచ్చి నేలమీద పోసి కత్తిపీటతో కూర తరుగుతూ తన ఎదురుగా చతికిలబడింది. ఇహ ఏమాత్రం లాభంలేదని ఆ కాసిన్ని పాలూ గొంతులో పోసుకొని "వెధవాయ్- మన బంగారం ఏమైపోయాడో ఏమో. వెయ్యి గుళ్ల పూజారి" అని ఓమారు సణుక్కున్నాడు తనలో.

"రాయుడూ! ఎక్కడ చచ్చేవురా? పిలుస్తే పలకవు" అని ఒక స్త్రీ కంఠం కంచుగంటలా మోగింది. దానికి ప్రతిధ్వనిలా వెనువెంటనే "ఒరే రాయుడూ! అమ్మ పిలుస్తోందిరా వినపడ్డంలేదూ?" అని ;జలుబుచేసినట్టు రాపిడితో ఒక పురుషకంఠం ఉరిమింది. మందడి గోడ వెంటిలేటర్‌లోంచి వస్తున్న ఆ శబ్ద తరంగాల్ని ఏరుకుంటూ "వరం! మన పక్కనున్న పెద్ద వాటాలోకి ఎవరో వచ్చి దిగినట్టున్నారు" అన్నాడు జగన్నాథం. అవునన్నట్లు నీరవంగా తలమాత్రం ఊపి బెండకాయలు తరుగుతోంది వరలక్ష్మమ్మ. ముక్కుమీదకి వాలుతున్న సులోచనాల్ని కుడిచేతి మధ్యవేలితో ఎగదోస్తూ "ఎవ్వరికీ అద్దెకివ్వనని చెప్పి ఉన్నవాళ్లనే ఖాళీచేయించేశాడే ఇంటాయన... మరి" అని ప్రశ్నార్థకంగా చూశాడు భార్యను మాట్లాడించినా మాట్లాడకపోతే.

"ఆ వచ్చినవాళ్లు అద్దెకొచ్చిన పరాయివాళ్లు కారు. ఇంటి పెద్దమనిషికి స్వయాన అక్కా బావగారూనూ. ఆయనేదో మిలిట్రీలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడట. సెలవుమీద వచ్చి ఇక్కడే రెండునెలలపాటు ఉండి ఇక్కడికి దగ్గరగానే పెద్ద బంగళా కట్టించు కుంటాడట. వాళ్లగ్రామంలో ఏదో భూముల వ్యవహారం కూడా చూసుకోవాలట" అని కాస్త స్వరంతగ్గించి

తనదాకా వచ్చిన సమాచారాన్ని భర్తకు అందించింది.

అలా ఒకవారంరోజులపాటు పక్క వాటాలోని జంట గొంతుకలు కావలసినంత సందడిచేస్తూనే ఉన్నాయి. ఒకటి కంచులా మోగితే ఇంకొకటి మబ్బులా ఉరుముతుంది. ఈ రెంటికీ మధ్య "ఆయ్, మరేనండీ, సరేనండీ- అలాగాండీ"- అంటూ అరుదుగా హీనస్వరం ఒకటి కామాలాగా, నిండుచుక్కలాగా, సెమికోలనులాగా, ఆశ్చర్యార్థకంగానూ అడ్డువస్తూ ఉంటుంది: అంతే.

ఒక ఉదయం "రాయుడూ! నా బాత్రూం జోళ్లు కనపడ్డంలేదు. చూసి తీసుకురా. కాలుకింద పెడితే గరగరమంటోంది. అస్సలు ఇల్లు ఊడుస్తున్నావట్రా" అంటూ లేచింది కంచుకంఠం.

"ఇంకా అమ్మగారు లేవలేదట్రా? నువ్వు వేడిగా కాఫీచేసి పట్రా" ఉరిమింది అయ్యగారి గొంతు కాస్త దూరంనుంచి.

"రాయుడూ మంచి కాఫీ చెయ్యడం ఎప్పుడు నేర్చుకుంటావురా? ఈ కాఫీ నీ మొహంలా ఉంది. అంత చక్కెర వేసుకుంటారా మరీని. ఈ కాఫీ నే ఛస్తే తాగలేను. మళ్లీ నీళ్లు పెట్టు కాఫీకి; నే వచ్చి చక్కెర వేస్తాను- పద"

ఇంకొంతసేపటికి- దొరవారి కంఠం ఉరిమింది. "వెధవాయ్. నీకు కళ్లు పోయినట్లున్నాయిరా రాయుడూ. ఈ కాఫీలో ఉప్పు పోసినట్టున్నావు- ఇలాంటి వెధవ పనులుచేస్తే మీసాలు పీకేస్తాను జాగ్రత్త."

"చక్కెర నే వెయ్యలేదండి. అమ్మగారే ఏసినారండి...!"

"అమ్మగారికి కళ్లజోడుఇవ్వకుండా వంటింట్లోకి రానివ్వకురా సన్నాసీ.!"

"ఏదైనా ఇంత పొరపాటు జరిగితే చాలు మీ అయ్యగారు నామీద్నా, నా కళ్లజోడుమీదా పడిపోతారు. నాకీ బాధంతా నీవల్ల వస్తోంది. మాతోవచ్చి రెండునెల్లయి ఉంటున్నావా? ఫటాఫట్పని నేర్చుకుందామని చొరవ లేదుకదా. అన్ని పనులూ నేను చేసుకు చూసుకుంటూ ఉంటే నువ్వెందుకురా రాయుడూ!"

"నేను రిటైర్ అయ్యేలోగా ఆ వెధవకి ఫౌజీ ఉద్యోగం వేయించమని మన ఊరెళ్లినప్పుడు నా వెంటపడి వాళ్లనాన్న పీడ్చి తగిలించాడు. నా ప్రాణం తీస్తే సరే అని లాక్కొచ్చాను. నీకేమో వాణ్ణి తర్ఫీదుచేసే ఓపికలేదు" విసుగ్గా ఉరుము.

"వాడి నాయనకి మీ మీదా నామీదా అభిమానమా ఏం? వాడికి సీసాలమీద మోజు. విస్కీ- రమ్మూ కావాలి గబ్బిలాయి ముసలి పీనుక్కి! ఈ వెధవాయ్ని ఆర్మీలో ఇరికించేస్తే తాగి పడుకుందామని వాడి ఆశ--"

ఇంకో ఉదయం వెంటిలేటర్లోంచి ఉరుములూ గంటలూ వినిపిస్తున్నాయి. జగన్నాథం

వేకువనే పాదయాత్ర పూర్తిచేసుకొని వచ్చి వార్తాపత్రికలో తలదూర్చాడు. కానీ చెవులు చిల్లులు పడేలాగా శబ్దతరంగాలు రొదచేస్తున్నాయి.

"ఇవాళ మన ఇంటికి రిటైర్డ్ కల్నల్ రావ్, అతని భార్యా భోజనానికి వస్తారు. ఇల్లు అడవిలా ఉంచక చక్కగా సర్దు. ఆ షోకేసులో మెమొంటోలు చూడు మకమకలాడుతున్నాయి. ఎన్నిమార్లు చెప్పాను కాస్త బ్రాసో వేసి మెరిపించరా అని" మబ్బు ఉరిమింది.

"రాయుడూ! అయ్యగారి జోళ్ల పాలిష్ చేశాక ఆ బ్రష్ అక్కడ ఎదురుగా పెట్టవద్దని ఎన్నిసార్లు చెప్పాన్రా." అమ్మగారి ఆవేదన మ్రోగింది.

"జోళ్ల పాలిష్‌చేస్తే- అందులో మొహం చూసుకునేలా అద్దంలా ఉండాలి. ఇదేట్రా-- అసలు నిన్ను కోర్టు మార్షల్ చేసెయ్యాలి" అయ్యగారి అసంతృప్తి పెల్లుబికింది.

ఈ శబ్ద ప్రపంచానికి వారంరోజులుగా అలవాటుపడ్డ జగన్నాథం, రాయుడు పేరు తరచూ వింటున్నాడు. ఆ దంపతులిద్దరి మధ్యా టెలిఫోన్లా, కాలికింద చెప్పులా, నోట్లో నాలుకలా వాళ్ల సుఖదుఃఖాలకి బాధ్యుడుగా, వినిపిస్తున్నాడు. కనిపించని ఆ శాల్తీ ఎవడోకానీ సహనశీలి అయి వుండాలి. లేదా చీమూ నెత్తురూ లేని జీవచ్ఛవమైనా అయి ఉండాలి. లేకపోతే రాళ్లనూ రప్పల్నీ మట్టినీ మాలిన్యాన్నీ తనలోకలుపుకుని దొర్లించుకుంటూ ప్రవహించే ఒక ప్రేమవాహిని అయినా అయి ఉండాలి- అనుకున్నాడు.

ఒక ఉదయం అలా మూడుమైళ్లు నడిచివచ్చి పాలగ్లాసు చేత్తో పుచ్చుకొని వార్తాపత్రిక తిరగేస్తున్నాడు జగన్నాథం. కిటికీలోంచి చల్లనిగాలి వీస్తోంది. ప్రపంచం ఎన్నడూ లేనంత ప్రశాంతంగా ఉన్నట్లు తోచింది. వార్తాపత్రికలో లీనమైన జగన్నాథాన్ని గంటలమోతకానీ ఉరుముల ఆర్భాటంకానీ ఇబ్బంది పెట్టలేదు. కాస్త ఆశ్చర్యంవేసింది. అవిశ్రాంతంగా వినిపించే గొంతులు మూగబోయాయా? లేక తన చెవులే పనిచెయ్యడం మానుకున్నాయా? అని మాత్రం తనలో అనుకున్నాడు. రెండునిముషాల నిశ్శబ్దం తర్వాత కాసింత కీచుగా ఉన్న గొంతు క్రమక్రమంగా స్థాయిని పెంచుకుని తెచ్చుకున్న గాంభీర్యంతో హూంకరిస్తోంది - గర్జిస్తోంది.

"వెధవా చెవులు మెలేస్తాను. మీసాలు పీకేస్తాను. కోర్టు మార్షల్ చేసేస్తా చూస్కో. డొక్క చీల్చి డోలు కడతా. ఇందాకట్నించీ నీకోసం సూస్తుంటే ఇప్పుడొస్తావట్రా..." అని వెంటిలేటర్‌లోంచి శబ్దప్రవాహం వస్తోంది. ఈ కీచుకంఠం ఎవరిది? ఈ కోపాగ్ని గురి అయిన శాల్తీ ఎవడు? జగన్నాథం కుర్చీలోంచి లేచి వీధి వరండాలోకి వెళ్లాడు.

భర్త పాలు తాగడం పూర్తి అయిందాలేదా అని వంటింట్లోంచి వచ్చిన వరలక్ష్మమ్మకు ఖాళీ కుర్చీ కనిపించింది. "ఈయన ఎక్కడున్నట్లు?" అని వీధి వరండాలోకి వెళ్లింది. పక్క వాటా కిటికీలోంచి తొంగి తొంగి చూస్తున్నాడు జగన్నాథం. "అదేం పనండీ? ఏంకావాలి

మీకు. ఆ పక్క వటాలోని వాళ్లు వేకువనే ఊరికి ప్రయాణమై పోయారు. వాళ్లంటే ఏమనుకుంటారు చెప్పండీ?" అని అంటోంది వరలక్ష్మమ్మ.

ఆ మాటలు చెవిని పెట్టకుండా ఏకాగ్రతతో కిటికీలోంచి చూస్తున్నాడు జగన్నాథం. అతని కళ్లలో ఏదో ఆశ్చర్యం, ఏదో ఆనందం.

"మీరు ఉదయాన్నే చేతికర్ర పట్టుకుని అలా వీధిలోకి వెళ్లిన మరో పావుగంటకి పక్కవాటావాళ్లు ఊరికెళ్లారు. రెండురోజులదాకా రామని అంటూ రాయుడికి వెయ్యారు జాగ్రత్తలు చెప్పి ఇల్లు చూసుకోమని మరీ మరీ చెప్పి వెళ్లారు" అంటూ చెప్పుకుపోతోంది వరలక్ష్మమ్మ.

జగన్నాథం చూస్తున్న విశేషమేమిటో- ఆనందించే విషయమేమిటో అర్థంకాలేదు.

"అయ్యో! రాయుడంటే ఎవడో ఎంతవాడో అనుకున్నాను. వీడేనా. పట్టుమని పదేళ్లయినా నిండాయో లేదో- వీడికి పీకేసే అంత మీసాలేవీ? ఇంకా రెక్కలురాని పక్షి..." అంటూ భార్యకేసి చూశాడు జగన్నాథం.

"ఇంతకీ ఏం చేస్తున్నాడేమిటి?" అని అడిగింది భార్య.

"గంభీరంగా పళ్లు బిగించి వాడికి నోటికందిన తిట్టు తిడుతూ మన బంగారంగాణ్ణి చేరదీసి దువ్వుతూ పాలుపోసి తాగిస్తున్నాడు. వీడేమో మురిపాలు కురిపిస్తూ ముద్దులుకుడుస్తూ వాడి తోకతో రాయుడి మోకాలు చుట్టి పాలన్నీ ఊదేస్తున్నాడు."

"పిల్లి పాలుపోస్తే తాగకుండా దిక్కులు చూస్తుందాఏం? అందుకనేకాబోలు మీ బంగారం ఈ మధ్య మన ఇంటిమీద శీతకన్ను వేశాడు" అంటున్న భార్య మాటలు చెవినిపెట్టుకున్నాడో లేదో కానీ తనలోతనే "ఎవడో వెర్రినాగన్న! తన తండ్రి తాకట్టు పెట్టిన బాల్యాన్ని ఇలా వెతుక్కుంటున్నాడు పాపం." అని గాఢంగా నిట్టూర్చాడు జగనాథం.

('ఈనాడు ఆదివారం.)
9-10-1994